# పశుపక్షుల సమావేశం

శ్రీ కొనకళ్ళ వెంకటరత్నం.

రాత్రి పదిన్నరవుతుందేమో. పేపరు చదవట మింకా పూర్తి కానేలేదు. అప్పుడే యెక్కణ్ణించోవొచ్చి నిద్రాదేని కటిక్కనే కావిలించుకుంది. కళ్లమూశా. ఆ మాగన్ను నిద్రలో హిట్లరు బొద్దింక మీసాలూ. ఛాంబర్లేను పిట్టగొడుగూ, గాంధీగారి బోసినోరూ అన్నీ ముసుగు లేసుకుని మెదడులో సంచారంచేస్తున్నాయి. పెద్ద కోలాహలం వినిపించింది. వులిక్కిపడి లేచా. చూస్తే, అదొహ పెద్ద కికారణ్యం. వొక యెత్తైన మర్రిచెట్టు చిటారుకొమ్మని కూచున్నాను. తడిమి చూచుకుంటే, నెత్తిమీద వొక చిన్న కిరీటముంది. ఈ చక్రవర్తిత్వ మెక్కడిదో అని కిందికి చూస్తినిగదా, జీవరాసులన్నీ దూరాన్ని గుమికూడివున్నాయి. ఎడ్లూ, గేదెలూ, మేకలూ, గొర్రెలూ వొకటేమిటి అన్ని జంతువులూను—చిలకలూ, బాతులూ, కోళ్లూ, వొకటేమిటి, అన్ని రకాల పక్షులూనూ. ఏ వర్గానికి కావర్గం బారులు తీర్చికూర్చున్న వైఖరీ అదీచూస్తే వొక బ్రహ్మాండమైన సభ సమావేశమయినట్టుంది. మరుక్షణం, నా అనుమానం స్థిరమయ్యింది. ఎదట వొక చిన్న గుట్టమీదగున్న యేనుగొకటి లేచి నిలబడి తొండాన్ని గండశిలలమీద కొడుతూ "నిశ్శబ్దంగావుండాలి. అల్లరి చెయ్యగూడదు" అని హెచ్చరించింది. ఈ జంతువులన్నిటికీ మన తెలుగుభాష శరణ్యమయిందేమా అని మీమాంసకలిగింది. "దేశభాషలందు తెలుగులెస్స" అన్నసూక్తి జ్ఞాపకానికొచ్చి సమాధానం చెప్పుకున్నాను,

అధ్యక్ష పీఠాన్నించి, గజేంద్రుడులేచి, ప్రారంభోపన్యాసం వుపక్రమించాడు.

"సభాసదులారా! మనమంతా ప్రకృతి బిడ్డలం. ఈ మహారణ్యాలూ. యీ ఫలవృక్షాలూ, అన్నీ భగవంతుడు స్వయంగా మనకోసరమని వడ్డించి, సిద్ధంగావుంచిన భోజనశాలలు, ఈ కొండగుహలూ, యీ సరస్సులూ మనకని యేర్పాటైన విహారస్థలాలు, మన యీ స్వేచ్ఛకీ, ఆనందానికీ. జీవితానికీ మారకుడై విజృంభిస్తూన్న మానవ, హంతకుని విషయమై మనలో మనం చర్చించుకోవటానికే యిక్కడ సమావేశమైనామన్న సంగతి మీ కందరికీ తెలుసును. అంతర్యంలో యెన్నిఅభిప్రాయభేదాలున్నా, మన మృగరాజు సంతతివారూ. శార్దూలవంశంవారూ, తోడేళ్ళవర్గంవారూ,—అంతా మనతో [illegible] యీ గడ్డలోపుట్టి యీ గడ్డలో పెరిగిన వాళ్ళవటంచేత,—అంతా సో[illegible]తుల్యులు మనకు, వారందరూ ఈ సభకి హాజరు కాకపోవటం శోచనీయం. అందరూ యీ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, అందరికీ సమాన శత్రువైన యీ మానవహంతకుని ఎదుర్కొని, దిగ్విజయానికి కారకులౌతారని ఆశిస్తున్నాను. ఇంకా మాట్లాడవలసినవారు చాలా మందున్నారు. మొట్టమొదట, మన జంతునియోజకవర్గానికి అభ్యర్థిగావచ్చిన వృషభనాయకులు గంభీరమైన వుపన్యాస మివ్వబోతున్నారు. సావధానంగా వినవలసిందని హెచ్చరిస్తున్నాను" అని కొండ అదిరేటట్టు కూచుంది.

వొక యెద్దు ఉపన్యాస వేదికమీద నిలబడి, కుచ్చుతోకతో మీద వాలుతూన్న కందిరీగల్ని తోలుకుంటూ, గంగడోలు అల్లలాడిస్తూ మాట్లాడింది "మహాజనులారా! నేడు చాలా సుదినం. ఏనాడీ మానవహంతకుడు మన జీవితంలో అడుగుపెట్టాడో, ఏనాడు మనల్ని జయించి, తన సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నాడో, నేటివరకూ అతను తన నిరంకుశ ప్రభుత్వాన్ని చెలాయించుకుంటూవచ్చాడు. ఇప్పుడు మానవలోకంలో వొక పెద్ద కల్లోలం బయలుదేరింది. ఒకళ్లనొకళ్లు కొట్టుకుని ఛస్తున్నారు. మనల్నందర్నీ స్వేచ్ఛదూరంచేసిన మానవాధములు తన స్వేచ్ఛకే దూరమవుతున్నాడు నేడు. ఇది చాలా శుభసూచకం. ఈ విషమసంధిలోనే స్వరాజ్యంకోసం వొత్తిడిచెయ్యాలి మనం. ఈతరుణం దాటితే, మన జాతికిహ మోక్షసిద్ధిలేదు.

"ఈ మానవహంతకుడు మన జంతువర్గాన్ని యెన్నివిధాలుగా హింసిస్తున్నాడో, వివరంగా చెబుతాను. వింటే, ఎంత కఠోరహృదయమైనా కరిగి సెలయేరై పారకమానదు. ఈ పొలాలన్నీ మాచేత దున్నిస్తాడు. ములుకోలతో పొడుస్తాడు. నాగలికర్ర రెండడుగులు భూమిలోదూర్చి, కంచీకర్రతో నురుగులు కక్కుతూవున్న మామూతులమీద కొడతాడు, నాగల్ని తోలుకునేందుకైనా వీలులేకండా తోక మెలిపెడతాడు, ముక్కులికి తాళ్లు పోసి బళ్లులాగిస్తాడు, జట్కాబళ్ళవాళ్ళూ, యెద్దు బళ్ళవాళ్ళూ, వాళ్లివ్వలిసిన లైసెన్సులికి వొక్క అణా పెచ్చువేశారంటే, సమ్మెకట్టేస్తారు. అంతా జాలి పడతారు. కాని, యీ బళ్ళవాళ్ళు సంపాయించే సొమ్ములో యెంత. మాకుగాని, మా అశ్వసోదరులకిగాని ఆహారంకింద ఖర్చుపెడుతున్నారో, అడిగినవా డొక్కడైనావున్నాడా? ఇంతెందుకు, ఈ మానవలోకంలో ఎక్కడ నాగరికతవుందో, యెక్కడ భోగభాగ్యాలు సమృద్ధిగావున్నాయో, అక్కడల్లా మా జవసత్వాలూడ్చి పెట్టబడ్డాయని సులభంగా తెలుసుకోవచ్చు. అన్నిటికన్న అవమానకరమైన విషయం. మా అండాలు కొట్టించి మా సంసారవాంఛనిచంపి, మమ్మల్ని సృష్టికిసైతం అనర్హుల్నిగాచేసి తన సేవచేయించుకుంటున్నాడు. ఇంతకంటే ఘోరమింకేమి కావాలి? అంతేనా,—మా ఆడంగుల పొదుగుల మీద—మానహీనమైనపని అనికూడా శంకించక—చెయ్యేసి, పాలుపిదికి, మా బిడ్డల కడుపుకొట్టి, తాను, మీగడలూ, అవడలూ, కాఫీలూ, టీలూ, కోవాబిళ్ళలూ తియ్యతియ్యగా చేసుకుని, తిని. కండలు పెంచుకుంటున్నాడు. మన గొర్రె సోదరుల్ని మందలు మందలుగా కూర్చి. ఈ శీతోష్ణాలు వోర్చుకునేందుకు దయామయుడైన భగవంతుడు వారికి ప్రసాదించిన సహజకవచాల్ని ప్రతిసంవత్సరమూ వూడబెరికి. కంబళ్ళకిందా, శాలువలకిందా మార్చి, కప్పుకుని, కులుకుతున్నాడు. అడవిలో పచ్చికమేసి. సెలయేటి నీళ్ళుతాగి, మునీశ్వరుల్లా పొద్దుపుచ్చే మన జింకా, లేడి సోదరుల్ని,

వేటనెపంమీద, కేవలం వినోదంకోసరమని, తరిమి తరిమి, చంపి, హింసించి, చర్మాలువొలిచి, కొమ్ములూడబెరికి తన యింటికి తీసికెళ్ళి అలంకరించు కుంటున్నాడు. మీలో పౌరుషరక్త మొక్క బిందువున్నా, యీ అవమానాన్ని సహించగలలా?—" హైమయి పోయిందని గజేంద్రుడు ఘీంకరించాడు.

తరవాత, "పక్షిజాతి నియోజకవర్గానికి అభ్యర్థిగావొచ్చిన చిలకమ్మ గారుపన్యసిస్తారు. అందరూ నిశ్శబ్దంగావుండాల"ని కూచున్నాడు. చిలకమ్మ వుపన్యాస పీఠంమీద వాలింది. ఆమె తియ్యనివాక్కులకి సభాసదులంతా ముగ్ధులైపోయారు. కోతులుగూడా కిచకిచలు మానుకున్నాయి. చిలకమ్మ వుపన్యసించింది. "మన వృషభనాయకులు పశుజాతికి మానవుడుచేసే ఘాతుకాలన్నీ చక్కగా విపులంగా చెప్పారు. పశుజాతికంటెకూడా మన పక్షిజాతికీ మానవుడుచేసే దురంతాలు ఇన్నీ అన్నీ కావు. మాతోడి సోదరులెంత మంది యీ మానవహంతకుని యిళ్ళల్లో విలాసార్థంగా కట్టబడిన పంజరాలలో చిక్కుకుని, నిరంతర కారాగారవాసం అనుభవిస్తున్నారో తల్చుకుంటే నాగుండె తరుక్కుపోతోంది. అంతేకాదు; కేవలం వేడుకకోసరమని. తుపాకీ పేల్పులలో తమ చేతులతీట తీర్చుకునేందుకు, తమలోవున్న రాక్షస ప్రవృత్తుల్ని తృప్తిపరుచుకునేందుకు, పిట్టలవేటంటూ—అది రాజధర్మం కూడాను—యీ జమీందార్లూ, యీ షికారీలూ, స్నేహితుల్ని వెంటబెట్టుకుని, మన కుటీరాలమీద చేసేదాడి తలుచుకుంటే, వొడలు కంపరమెత్తుతుంది. ఆ ఘడియల్లో, రెక్కలురాని మన పిల్లల అలజడీ, పసికూలిన్న విడిచిపెట్టి ఎగిరిపోలేక గూళ్ల నంటిపెట్టుని మన బాలెంతలుపడే సంక్షోభమూ వర్ణనాతీతము కదా! ఏదో వొక పట్టణంమీద హిట్లరు నాలుగు బాంబులు వేశాడంటే నలుగురు చచ్చారు, అయిదుగురికి గాయాలు తగిలాయి, అంటూ విడ్డూరంగా పత్రికలలో వేసుకుని చదువుకుంటాడీ మానవుడు. అధర్మ యుద్ధమనీ, అంతర్జాతీయ సంప్రదాయాలకి విరుద్ధమనీ, హుంకరిస్తాడు. కేవలం ఆకులూ, కాయలూ, పళ్ళూ తిని. వొకరి కపాయం కలలోనైనా తలపెట్టని నిష్కపట జీవులమూ, నిస్సహాయులమూ ఐన మన మీద సాగిస్తూన్న యీ దౌష్ట్యానికే ధర్మ శాస్త్రాన్ని పురస్కరించుకున్నాడో యీ మానవ పిశాచి. మనం ప్రాణాలు రెక్కల కొసలలో పెట్టుకుని అల్లల్లాడుతూంటే, 'అన్నన్నా గురి తప్పిపోయిందే' అని వొకడూ, 'ఛెహబాష్, ఒక్క దెబ్బకి పది పిట్టలు రాలాయి' అంటూ మరొకడూ సల్లాపాలు, ప్రలాపాలు—(ఛీ, ఛీ" అని సభలో కేకలు సభంతా వుద్రేక పూరితమైపోయింది) గొంతు సవరించుకుని మళ్లా ప్రారంభించింది,

"వీళ్ళ మూలాన్ని, ముఖ్యంగా, మన కుక్కుట సోదరీమణులు పొందే గర్భశోక మింతా అంతా కాదు. ఈ మానవ హంతకుడికి కోడి గుడ్లు బలకరమైన ఆహారం. మన కోడిపెట్ట యిల్లాంద్రకు క్షణక్షణమూ గర్భ శోకం కల్పిస్తూ, మన సంతానానికి ఆధార భూతమైన గుడ్లతో తన పొట్ట నింపుకుని, పైగా, యితరదేశాలకి కూడా యెగుమతి చేస్తున్నాడు. నూనెలో వేయించుకునీ, సొనమందుల్లో మేళవించుకునీ, తిని, కండ బలిసి, విశృంఖలంగా తిరుగుతున్నాడు. తువ్వాయిలకని యేర్పడిన అవుల పాలూ. భావి సంతానానికి మూలాధారమైన కోడిపెట్ట యిల్లాండ్ర గుడ్లూ మన కందరికీ ఆహారంగా సృష్టింపబడిన కాయలూ, పళ్ళూ, యివన్నీ పుట్టుముట్టి, మానవుడే కైంకర్యం చేసుకుంటున్నాడు. స్థావర జంగమము లోకాన్నంతా ఇలా కబళిస్తున్నా పొట్టనిండక, మానవలోకంతో ఒకరు కీచులాడుకుంటున్నారు. ఈ స్వార్థజీవిని, ఈ క్రూర రాక్షసిని, మనం హతమార్చాలి. ఇంతటితో విరమిస్తున్నా" నంది. జయజయ ధ్వనులలో సభ అల్లకల్లోలమయింది.

అధ్యక్షుడు లేచి, మధ్య మధ్య ఘీంకరిస్తూ, అంత్యోపన్యాసమిచ్చాడు: "మానవుడు నిర్భయంగా మన రాజ్యంలో చేస్తూన్న క్రౌర్యమూ, చౌర్యమూ అంతా క్రితముపన్యసించిన పెద్దలు విపులంగా విశదీకరించారు. మన కర్తవ్యమేమిటో యిప్పుడు సంక్షేపంగా మనవిచేస్తాను: ఇప్పుడు మానవుడు గొప్ప అంతర్యుద్ధంలో చిక్కుకున్నాడు. ఈ సమయంలో అతనికి వెన్న, మాంసమూ, ఇత్యాదులెన్నో అవసరం. అవసరమేమిటి, విరివిగా అప్పుడే వుపయోగించుకుంటూ వున్నాడు కూడా. దీనికి మనతో యేమైనా సంప్రదించాడా. స్వాతంత్ర్య సంరక్షణకని ప్రాణాలు బలివ్వాలని అందరూ ధర్మపన్నాలు చెప్పేవారే, మనమాటేమిటి? కాలికింద మన స్వేచ్ఛని నొక్కిపెట్టి, చేతిలో తన స్వతంత్రాన్ని యిముడ్చుకుందామని చూస్తాడా? ఈ సంగతి మనం సాగదీసి అడగాలీ తరుణంలో. మీ అందరి సానుభూతీ, సహకారమూ వుంటే మన వుద్యమానికి జయమిట్టే చేకూరుతుంది—"సభ ముగిసింది. పిట్టలు టపటప రెక్కలు కొట్టుకున్నాయి. పశువులు రంకెవేశాయి. తువ్వాయిలు చిందులు తొక్కాయి.

ఈ సమూహమంతా నా దగ్గిరికి కదిలి వచ్చింది. నా గుండె గుభేలు మంది, ఇన్నీ అమాంతంగా మీదపడితే. పాములు నాలుగూ మెడకు చుట్టుకుంటే! రెండు మూడు గుడ్లగూబలు మూగి కళ్ళు పీకేస్తే! బలిసిన యెద్దొకటి డెక్కలు రెండూ డొక్కమీద వేసి నొక్కితే, 'హరీ' అనటాని కెంత కావాలి? మరోవైపునించీ వేరే సభ ముగించుకుని మృగరాజూ, పెద్ద పులిదొర, వారి అనుచరులూ అంతా వొస్తున్నారు. కొంచెం గుండె ధైర్యం చిక్కింది.

నక్కబావ అందరి తరపునా వొక కాయిత మందిచ్చింది నాకు. చదువుకున్నా. నాకైతే స్వరాజ్య మిచ్చెయ్యాలనే వుంది కాని, ఇంత సామ్రాజ్యం, అనాదినించీ మన కాలికింద సాగిపోతూన్న యీ అధికారం చేతులారా జారవిడవటమంటే మనసొప్పలేదు. తేరిపారజూచా. పెద్ద పులిబావని స్వరాజ్యం విషయమై మీ అభిప్రాయమేమిటని ప్రశ్నించాను. లేచి చెప్పింది

"అరణ్యాలు కొట్టీ, మమ్మల్ని వేటాడీ, మా చేతుల్లోవున్న రాజ్యాల్ని లాక్కునీ సర్కసులలో రాచి రంపాన బెట్టీ, మా వ్యక్తిత్వాన్ని యిప్పటికే ఛంపేశారు. మేము అల్ప సంఖ్యాకులం. ఇప్పుడు. సార్వభౌములు పశుపక్ష్యాదుల కివ్వదలిచే యే స్వరాజ్య ప్రణాళికలోనైనా సరే, మా ప్రత్యేక హక్కులు సంరక్షించబడాలి—" "పెద్ద పులులికి ప్రత్యేక సంరక్షణ లేమిటయ్యా" యని సభలో కేకలు—"అంచేత మాతో సంప్రతించకుండా ఏ విధమైన వొడంబడికా చెల్లనేరదని ఘంటాపథంగా చెబుతున్నాము" అంది. తరువాత సీమకుక్కని పిలిచి అడిగా. "నిష్పక్షపాతంగా చెప్పాలిసొస్తే మానవులు మనకంటె నాగరీకులు. అది వొప్పుకోక తప్పదు. మమ్మల్ని చూడండి; కన్న బిడ్డలకంటె యెక్కువ ప్రేమగా చూస్తాడు, తమతో పాటు మాకూ

కూడా స్నానపానాలన్నీ యేర్పాటుచేసి ఎంతో ఆదరణ యిస్తాడు. విజిటింగ్ కార్డు (Visiting Card) యిచ్చి గాని లోపలికి రావటానికి వీలులేని కచేరీ గదుల్లోకి కూడా మేము అతి చనువుగా, అతి స్వేచ్ఛగా, యింటో ఆడంగులకంటే యెక్కువ విచ్చల విడిగా తిరుగుతాము—"

"మునిసిపాలిటీ కుక్కలబిళ్ల మాటేమిటయ్యా" యని అరచిందొక వూరకుక్క—"ఇంతేకాదు, గుర్రాలకి మానవులిచ్చే అధిక్యతో, మరి యేదా, కనం, వినం. పావురాయిలని రోజూ అలా వొదిలేస్తూంటాడంతే. అవే మానవుని కరుణా, అదరణా వొదలలేక, మళ్ళీ తిరిగివొచ్చి అతని సాన్నిధ్యాన్ని వాలుతూంటాయి. ఎన్నో యెద్దుల్ని, గిత్తల్ని ముద్రవేసి వొదిలేశి స్వాతంత్ర్య ప్రదానంచేసి 'వెంకన్న'లని పూజిస్తారు—(మళ్ళీ పట్టుకుని చావగొట్టటం లేదయ్యా గంగిరెద్దువాళ్ళంతా—అని సభలో కేకలు) అంచేత మానవుల యాజమాన్యం కింద మనకింకా కలగబొయ్యే మేళ్ళన్నీ వొక్కసారి సింహావలోకనం చేసుకోండి, తొందర పడకూడదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన రాజభక్తిని కనబరిచి సార్వభౌమునికి పూర్తిగా సహకార మివ్వాలి అని విరమించింది.

తాబేటికాయని పిల్చా. "స్వరాజ్యమంటే యెవరొద్దంటారు. కాని, మన సార్వభౌములుకూడా, మన వుద్యమానికి సానుభూతి చూపుతూనే వున్నారు. మనం మహజర్లు పంపుకునీ, మనవులు చేసుకుంటే వారి మనస్సు కరిగించి ఆ ప్రవాహంలో మన స్వతంత్రమనే పూలనావని తేల్చుకుని, విజయ ధ్వజ మెత్తాలి. అంతేగాని, అక్రమమైన ఆందోళనా, అనవసరమైన జులుమూ చేస్తే చాలా నష్టపోతాము. నెమ్మదిగా, ప్రశాంతంగా కృషి చేసుకుంటూ పోతే, మన ఆశయాలన్నీ సఫలీకృత మవుతాయి" అంది.

ఇహ నాతుది నిశ్చయం చెప్పదలుచుకున్నాను. ఇప్పుడు స్వరాజ్య మివ్వటానికి నాకేమీ అభ్యంతరంలేదు, ఈ బరువుదించుకుని చక్కా పోవటానికే మేమూ ఆలోచిస్తున్నాము. కాని, యిప్పుడు నా కళ్ళముందు జరిగిన చర్చలనుబట్టిచూస్తే, మీకు కావలిసిన స్వరాజ్యరూపమెదో, ఆ విషయమై మీ కెవరికీ ఐక్యభావమున్నట్టు కనపడదు. శార్దూలాది మాంస భుక్కులంతా అల్ప సంఖ్యాకులు. వారు ప్రత్యేక రక్షణలు కోరటంలో విశేషమేమీలేదు. అదిన్నికాక యింకా మృగరాజులూ, పక్షీంద్రులూ ఇత్యాది బిరుదాంకితులున్నారు. వారు తమ తమ సామంతాలు అనాదినించీ నడుపుకుంటూ వొచ్చారు. ఈ బిరుదులూ, యీ కితాబులూ అన్నీ పవిత్రమైన, ఒక్కసారిగా, అన్నిటినీ తుడిచిపెట్టి పారెయ్యటమంటే సాధ్యమా? ఇలాంటి చిక్కులెన్నో వున్నాయి. ఈ చిక్కులేమీ లేవని మనం కళ్లమూసుకున్నంతమాత్రంచేత అవి విడిపోవు, అంచేత, మీరూ, అల్పసంఖ్యాకులైన శార్దూల వర్గంవారూ; సీమకుక్క పక్షంవారూ, తాబేటి తత్త్వంవారూ అంతా కలుసుకుని వొక వొడంబడికచేసుకుని చక్కారండి. స్వరాజ్యపట్టా యిదుగో చేవ్రాలుగూడాచేసి జేబులో సిద్ధంగా వుంచుకున్నా. వొడంబడిక పత్రం మీరు పట్టుకురాగానే అది పుచ్చుకుని యిదిచ్చేస్తానంతే."

తోడేలు దూడ పెయ్యలవంక చూచింది. పిల్లి చిలకలమీద కన్నువేశింది. మృగరాజు అందర్నీ తేరి పారజూశాడు. భళ్లున తెల్లవారింది. కళ్లు నులుముకుంటూ చూస్తే, కల!


మహాశివరాత్రికి శ్రీశైలం

జి. కె. మంగరాజుగారి

భాగీరథి పుష్కరములకు గంగానదీ స్నానములు

# పూర్ణయాత్ర స్పెషల్ ట్రెయిన్

**10-2-1940** తేదీని బయలుదేరును.

యీ సంవత్సరం వృద్ధాచలం, అరుణాచలం, హంపీవిరూపాక్షం, శ్రీశైలం, మహానంది, పూనా, భూసావల్, నర్మదా, ఇందూరు, ఉజ్జయిని, గ్వాలియరు, కాల్కా (సిమ్లా) కాన్పూర్, పాట్నా, తారకేశ్వర్, కటక్ నూతనముగా చేర్చడమయినది.

ఉత్తర దక్షిణయాత్రలకు వేర్వేరుగాకూడా టిక్కెట్లు యివ్వబడును.

వివరములకు:—పూర్ణయాత్ర కంపెనీ,

మెయిన్ రోడ్డు, విశాఖపట్టణం. బ్రాంచి:—గాంధీనగర్, బెజవాడ.